క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు శనివారం తెలిపారు. 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా కలెక్టరేట్, దుర్గాకాలనీ, మిథిలానగర్, కేశవనగర్, బీటీఎస్, మిర్యాలగూడ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నకిరేకల్ : పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఓవర్‌లోడ్ కారణంగా కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమరుస్తున్నందున ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు మండల ఏఈ సాయిగణేష్ శనివారం తెలిపారు. అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



రుత్విక్

నల్లగొండ టూటౌన్ : ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జేఈఈ మెయిన్స్‌లో పట్టణానికి చెందిన మురారిశెట్టి రుత్విక్‌మణిసాయి 99.97పర్సంటైల్ సాధించి ప్రతిభ కనబర్చాడు. రుత్విక్ హైదరాబాద్‌లోని నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. రుత్విక్ తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులే. ఉత్తమ ర్యాంకు సాధించిన రుత్విక్‌ను కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

జేఈఈలో సిరికి 91.38 పర్సంటైల్



కంబాలపల్లి సిరి

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలోని గంగదేవిగూడెం గ్రామానికి చెందిన కంబాలపల్లి మల్లేష్–సైదమ్మ దంపతుల కుమార్తె కంబాలపల్లి సిరి ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో 91.38 పర్సంటైల్ సాధించింది. సిరి 1నుంచి 5వతరగతి వరకు గంగదేవిగూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, 6నుంచి 10వతరగతి వరకు అయిటిపాములలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివింది. ప్రస్తుతం నల్లగొండలోని వినూత్న జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న సిరి 91.38 పర్సంటైల్ సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ముత్తినేని కృష్ణయ్య, అధ్యాపకులు సురేష్‌కుమార్, రమేష్, నాగేష్, శంకర్, తల్లిదండ్రులు అభినందించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని నీలగిరి కాలనీలో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా రెండోరోజు యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, జ్వాలాతోరణం, ధ్వజకుంభ ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వాస్తు, శాంతి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నల్లగొండ డివిజన్ కమిటీ ఎన్నిక

నల్లగొండ టౌన్ : పట్టణంలోని సుందరయ్య భవన్‌లో శనివారం ఎస్‌ఎఫ్‌ఐ నల్లగొండ డివిజన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.సైఫ్, మారుపాక కిరణ్ ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలపై అధ్యయనం చేసి నిరంతరం పోరాటం చేస్తామన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా విద్యాశాఖ ఏర్పాటు చేయాలన్నారు.

సాయి మందిర వార్షికోత్సవం



సాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

నకిరేకల్ : పట్టణంలోని మూసీరోడ్డులో గల శ్రీసత్యసాయి మందిర 16వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా నగర సంకీర్తన, రుద్రాభిషేకం, నారాయణ సేవ తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాల్లో మందిర అధ్యక్షుడు గర్రె శ్రీనివాస్, ప్రతినిధులు దేవరశెట్టి శ్రీనివాస్‌లు, బ్రహ్మదేవర పద్మాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

శేఖర్ అరెస్ట్ కక్షసాధింపు చర్యే

చండూరు : బీజేపీ దళిత నాయకుడు, మాజీ కౌన్సిలర్ అన్నెపర్తి శేఖర్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడం కక్షసాధింపు చర్యే అని ఆ పార్టీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపర్తి యాదగిరి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ అన్నెపర్తి సంతోష, దుబ్బ గణేష్, అన్నెపర్తి శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

సేవాలాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

నల్లగొండ టూటౌన్ : సంతు సేవాలాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని యువజన సర్వీసుల శాఖ యూత్ ఆఫీసర్ రామావత్ సైదానాయక్ అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేవాలాల్ సామాజిక పరివర్తన ఉద్యమకారుల పరంపరలో ఒకరిగా అభివర్ణించారు. సామాజిక పరివర్తన సమ్మిళిత సమాజం కోసం 22సూత్రాలను అందించి సమాజం కోసం శక్తివంచన లేని స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచే మార్గాన్ని ఆయన అందించారని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ మద్దిలేటి, డా. మారం వెంకటరమణారెడ్డి, డా. మిర్యాల రమేష్, డా.సురేష్‌రెడ్డి, రమేష్‌నాయక్, నరసింహ, అనిత, షరీఫ్, పండరయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నల్లగొండ టూటౌన్: సేవాలాల్ జయంతిలో పాల్గొని నివాళులర్పిస్తున్న అధికారులు

సేవాలాల్ సేవలు మరువలేనివి

మర్రిగూడ : గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ సేవలు మరువలేనివని మాజీ జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఖుదాబాక్షపల్లి గ్రామ పరిధిలోని సాయిబండాతండాలో సేవాలాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. సేవాలాల్ జీవితం ప్రతిఒక్కరికి ఆదర్శనీయమన్నారు. అనంతరం గిరి జనులు ఆయనను శాలువా, మెమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.



మర్రిగూడ : మాజీ జెడ్పీటీసీ సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న గిరిజనులు

చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని ఎంవీఆర్ పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలకు ర్యాంకులు ముఖ్యం కాదని జ్ఞానం నేర్పించాలన్నారు. స్కిల్స్ అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా మెడిసిన్ ఐఐటీతో పాటు ఉన్నత చదువులకు కోసం పేద విద్యార్థులకు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం టెన్త్‌లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను ఫౌండేషన్ ద్వారా విమానంలో ఢిల్లీలో మంచి యూనివర్సిటీలను చూపిస్తామన్నారు. ప్రతి సంవత్సరం 80మంది విద్యార్థులకు చదువుకోసం ఆర్థికసాయం చేస్తున్నానన్నారు. ఎంజీయూలో రూ.80కోట్లతో నూతన భవనాలు నిర్మించానని అన్నారు. డ్రగ్స్, సెల్‌ఫోన్‌లకు చిన్నారులను దూరంగా ఉంచాలని కోరారు. నల్లగొండ ఔటర్ రింగ్ రోడ్డుకు మార్చి నుంచి పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంవీఆర్ విద్యా సంస్థల చైర్మన్ కొలనుపాక గీతరవికుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంవీఆర్ పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బ్యాటరీలు చోరీ చేస్తున్న దొంగల అరెస్ట్

కేతేపల్లి: వాహనాల బ్యాటరీలు చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను శనివారం కేతేపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన మోదాల విష్ణు మిర్యాలగూడ పట్టణంలో ఆటో నడుపుకుంటూ అక్కడే నివాసముంటున్నారు. అతడికి మిర్యాలగూడ మండలం తుంగపహాడ్ గ్రామానికి చెందిన సెంట్రింగ్ పనులు చేసే భమ్మంపాటి మధుతో పరిచయం ఏర్పడి స్నేహితులుగా మారారు. వీరిద్దరు మద్యం, జల్సాలకు అలవాటు పడ్డారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు పార్కింగ్ చేసిన వాహనాల బ్యాటరీలు చోరీ చేస్తున్నారు. ఐదు నెలల కాలంలో నల్లగొండ జిల్లాలోని తిప్పర్తి, కేతేపల్లి, మాడ్గులపల్లి, నకిరేకల్ మండలాల పరిధిలో రాత్రివేళ పొలాలు, గ్రామ శివారులో రోడ్ల వెంట పార్కింగ్ చేసిన ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీల బ్యాటరీలను చోరీ చేస్తున్నారు. ఈవిధంగా చోరీ చేసిన 33 బ్యాటరీలను మోదాల విష్ణు స్వగ్రామం నకిరేకల్ మండలం పాలెంలో దాచిపెట్టారు. దొంగిలించిన బ్యాటరీలను అమ్మేందుకు శనివారం విష్ణు తన సొంత ఆటోలో మధుతో కలిసి పాలెం గ్రామం నుంచి నకిరేకల్ మీదుగా సూర్యాపేటకు బయల్దేరారు. కేతేపల్లి మండలం కొర్లపహాడ్ శివారులో శనివారం వాహనాల తనిఖీలు చేపట్టగా.. ఆటోలో వెళ్తున్న వీరిద్దరు పోలీసులను చూసి పారిపోతుండగా ఆటోను వెంబడించి పట్టుకున్నట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.2.94 లక్షల విలువైన 33 బ్యాటరీలు, ఆటో, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించిన శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ, కానిస్టేబుళ్లు రాకేష్, వరుణ్‌ను ఎస్పీ అభినందించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ శివతేజ

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

నల్లగొండ టౌన్ : పట్టణంలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం 250మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివలీల మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులు ఆకలితో ఉంటారని వారికి అన్నదానం చేయాలన్నారు. ఫౌండేషన్‌కు సహకరిస్తున్న ప్రతిఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమాచార హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బండమీది అంజయ్య, సీహెచ్ లక్ష్మీబాయి, వటికోటి లక్ష్మీశోభ, మాధవి, రాణి, కౌశిక్, పరమేశ్వరి పాల్గొన్నారు.

కృత్యాధార బోధనతో స్వీయజ్ఞానం

రామగిరి(నల్లగొండ): విద్యార్థులకు కృత్యాధార బోధనతో స్వీయజ్ఞానం అలవడుతుందని ఎన్జీ కళాశాల జువాలజీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ జ్యోత్స్న అన్నారు. శనివారం కళాశాల పీజీ విద్యార్థులు సముద్రయానం, మత్స్యకార వృత్తిపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాచీనకాలం, బ్రిటిష్‌కాలం, ఆధునిక సాంకేతిక యుగాల వారీగా షిప్పింగ్, ఫిషరీస్ నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. ప్రాచీనకాలంలో వాడిన చిన్న పడవలు, పుట్టి, తెరచాపలు, నౌకలు, ఓడల నమూనాలు తయారు చేశారు. మత్స్యకారులు వాడే చేపలను పట్టే వివిధ రకాల వలలను కూడా తయారుచేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అంతటి శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పరంగి రవికుమార్, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ వెల్దండి శ్రీధర్, సీఓఈ బి.నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ ప్రసన్నకుమార్, వేణు, డాక్టర్ భాగ్యలక్ష్మి, మహేశ్వరీ, సరిత, వెంకట్, విద్యార్థులు సిద్ధు, సృజన్, నవ్య, సఫియా ఫిర్దోస్, బుశ్రా, అశ్విని, ప్రణయ్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న డాక్టర్ జ్యోత్స్న

బీసీ కులగణన సంపూర్ణంగా జరపాలి

నల్లగొండ టౌన్ : బీసీల కులగణన సంపూర్ణంగా జరిగేలా చూడాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు అన్నారు. శనివారం పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం జ్యోతిబా పూలే భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన ఈ నెల 16నుంచి 28వరకు కాకుండా మార్చి 30వరకు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. డెడికేటెడ్ కమిటీ ఇచ్చిన కులగనణ రిపోర్టు తప్పుల తడక అని, కులగనణపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కలెక్టర్లను బాధ్యతగా పెట్టి సంపూర్ణ కులగణన చేయించాలని, ప్రజలకు అనుకూలమైన సమయంలో అధికారులు వారి ఇళ్లకు వెళ్లి కులగనణ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నేలపట్ల సత్యనారాయణ, కంది సూర్యనారాయణ, కాసోజు విశ్వనాథం, నల్ల సోమ మల్లన్న, కేశబోయిన శంకర్, గోలి విజయ్‌కుమార్, నకిరకంటి కాశయ్యగౌడ్, నాగులపల్లి శ్యాంసుందర్, జెల్లా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు

ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషిచేయాలి

నల్లగొండ టౌన్ : పట్టణంలోని మగ్దూం భవన్‌లో శనివారం గీత పనివారల సంఘం వ్యవస్థాపకుడు బొమ్మగాని ధర్మంభిక్షం జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్‌కుమార్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బు వీరస్వామి, వి.లెనిన్, జి.పండరి, అక్కలయ్య, కోటేష్ దుర్గయ్య, సైదులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో..

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని శనివారం స్థానికంగా బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కర్నాటి యాదగిరి, బీసీ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారింగ నరేష్‌గౌడ్, బీసీ యువజన సంఘం నాయకులు రావుల రాజేష్‌గౌడ్, నర్సింగ్ శివకోటేష్‌గౌడ్, నిరంజన్, నాగాచారి, మనోజ్ ఉన్నారు.

మునుగోడు : దివంగత మాజీ ఎంపీ బొమ్మగొని ధర్మభిక్షం ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను, నాయకులు సురిగి చలపతి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు, నాయకులు బి.లాలు, బండారి శంకర్, రేవెల్లి అంజయ్య, గౌడ సంఘం నాయకులు నకరకంటి యాదయ్య, జాజుల సత్యనారాయణ, పంతంగి స్వామి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలో మాజీ ఎంపీ, ఎమ్మెల్యే బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని సీపీఐ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఈదుల భిక్షం రెడ్డి, గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకల నిరంజన్‌గౌడ్ ధర్మభిక్షం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బుర్ర శేఖర్, ఆకుల రఘుమయ్య, ఎరుకల యాదయ్య, ఆకుల వెంకట్రామ్, మాదగోని నరసింహ, కర్నాటి అంజయ్య పాల్గొన్నారు.

చిట్యాల : పట్టణంలో గీత పనివారల సంఘం వ్యవస్థాపకుడు ధర్మభిక్షం జయంతిని శనివారం సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్, గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులుగౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎండీ.అక్బర్, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షరీఫ్, గీత సొసైటీ అధ్యక్షుడు కూనురు అంజయ్యగౌడ్, గౌడ సంఘం నాయకులు పొన్నం లక్ష్యయ్యగౌడ్, పంతంగి వెంకన్నగౌడ్, దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, కూనురు మారయ్య, శంకర్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

చండూరు : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ధర్మభిక్షం జయంతిలో ఆయన పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్లె యాదయ్యగౌడ్, బొడ్డు వెంకటేశ్వర్లు, పల్లె నరసింహ, శ్రీను, మల్లేశం, కోటి పాల్గొన్నారు.



నల్లగొండ టౌన్: ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు



మునుగోడులో ధర్మభిక్షం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సెమినార్ బ్రోచర్ విడుదల

రామగిరి(నల్లగొండ) : మిర్యాలగూడ పట్టణంలోని కెఎన్‌ఎమ్ డిగ్రీ కళాశాలలో మార్చి 17, 18 తేదీల్లో నిర్వహించే ఎకనామిక్స్ నేషనల్ సెమినార్ బ్రోచర్‌ను నల్లగొండ ఎన్జీ కళాశాల ఎకనామిక్స్ ఫోరమ్ అధ్యక్షుడు డాక్టర్ అక్కెనపల్లి మీనయ్య శనివారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రోత్ పోటాన్షాలిటీస్ ఇన్ తెలంగాణ స్టేట్ ప్రాస్పెక్టస్ చాలెంజెస్ అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు, ఎకనామిక్స్ ఉపన్యాసకులు, విద్యార్థులు సెమినార్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ డాక్టర్ జి.నరేష్, ఎన్జీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, అర్థశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ మునుస్వామి, ఉపన్యాసకులు ఎమ్.కవిత, హస్రత్, భిక్షమయ్య పాల్గొన్నారు.

3న రాజ్యాధికార చైతన్య సదస్సు

నల్లగొండ టౌన్ : పట్టణంలో మార్చి 3న నిర్వహించే బీసీ రాజ్యాధికార చైతన్య సదస్సును జయప్రదం చేయాలని వెనకబడిన తరగతుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.చెన్నరాములు అన్నారు. శనివారం పట్టణంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నవ సంఘర్షణ సమితి రాష్ట అధ్యక్షుడు జేఎస్ గౌడ్, లింగస్వామిగౌడ్, ఎండీ.రఫీ, సయ్యద్ తాజోద్దీన్, వంటిపాక యాదగిరి, నర్సింహ పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ చైర్మన్‌కు మాలధారుల సన్మానం

నార్కట్‌పల్లి : మండలంలోని నక్కలపల్లి గ్రామంలో శ్రీపార్వతి సహిత జడలరామలింగేశ్వర స్వామి ఆలయ ప్రథమ మండల మహా పడిపూజ కార్యక్రమాన్ని శివ మాలధారులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి శివస్వాములు సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈద మాధవి నర్సింహ, మాజీ ఎంపీటీసీ కనుకు ఆంజయ్య, రవికుమార్, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

అర్ధరాత్రి వరకు సోదాలు

మర్రిగూడ: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ సర్వేయర్ లావూడి రవికుమార్ రూ.12వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం పట్టుబడిన విషయం తెలిసిందే. శుక్రవారం అర్ధరాత్రి 1 గంటల వరకు సోదాలు కొనసాగాయి. పట్టుబడిన రూ.12వేలతో పాటు అదనంగా మరో రూ.12వేలు అతని వద్ద లభించగా.. అట్టి నగదు వివరాలు తెలుపలేదు. మొత్తం రూ.24వేలను సీజ్ చేసినట్లు ఏసీబీ సీఐ రామారావు శనివారం తెలిపారు. ఇంటి వద్ద జరిగిన సోదాల్లో కూడా ఎలాంటి లావాదేవీలు జరిగినట్లు రుజువు కాలేదని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



కట్టంగూర్ : విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని పరడ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు వెల్దండి వెంకట్‌రెడ్డి తన గేదెను గ్రామశివారులో గల చెరువు సమీపంలో మేపుతుండగా నీరు తాగేందుకు వెళ్లిన గేదె అక్కడ కిందకు వేలాడుతున్న విద్యుత్ వైరుకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం చోటు చేసుకుందని, ఆదుకోవాలని రైతు వాపోయాడు.

రిజర్వేషన్ల అవకాశాల నుంచి విరమించుకోవాలి

నల్లగొండ టౌన్ : క్రిమిలేయర్లు (దళిత సంపన్నులు) స్వచ్ఛందంగా రిజర్వేషన్ల అవకాశాల నుంచి విరమించుకోవాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ అన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ప్రజాపోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదీర్ఘ కాలంగా దేశంలో రిజర్వేషన్లు పొందుతున్న దళిత సంపన్నులు తమ కుటుంబాలకు రిజర్వేషన్లు వర్తించకుండా స్వచ్ఛందంగా తప్పుకుని నేటికీ ఎటువంటి ఫలాలు అందకుండా ఉన్న పేద దళిత వర్గాలకు అవకాశాలను ఇవ్వాలని కోరారు. సమావేశంలో ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్‌స్వామి, రాజకీయ విశ్లేషకుడు గాలి వినోద్‌కుమార్, చక్రహరి రామరాజు, బొర్ర సుధాకర్, కె.పర్వతాలు, దుడుకు లక్ష్మీనారాయణ, సోమ మల్లయ్య, ముంగునూరు సైదులు, గోలి సైదులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రకాష్

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



నల్లగొండ టూటౌన్: సాందీప్ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



నార్కట్‌పల్లి : బి వెల్లంల హైస్కూల్‌లో..

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని డీవీకే రోడ్డులో గల సాందీప్ హైస్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా ఒక రోజు విధులు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవహర్త సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ముధం స్వప్న నరసింహ, ఉపాధ్యాయులు ముధం నరసింహ, మేడి రాంబాబు, లక్ష్మి, పాశం స్వప్న, సుచరిత, రమాదేవి, జ్యోత్స్న, జహిరా, సత్తయ్య, కళ్యాణ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

బివెల్లంల జెడ్పీ ఉన్నత పాఠశాలలో

మండల పరిధిలోని బివెల్లంల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ శాఖల అధికారులుగా బాధ్యతలు నిర్వహించి అలరించారు. కార్యక్రమంలో ఎంఈఓ, పాఠశాల హెచ్‌ఎం కుకుట్ల నరసింహ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నరేష్‌కుమార్, చంద్రశేఖర్, గజ్జల శ్రీనివాస్, దారమల్ల విజయపాల్, గంగాధర్ ఉన్నారు.

కేతేపల్లి : మండలంలోని గుడివాడ మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ఏఏపీసీ చైర్మన్ అస్మా, పాఠశాల హెచ్‌ఎం కొండ శంకర్, ఉపాధ్యాయులు బి.ఆంజనేయులు, జి.శంకరయ్య, బి.నాగమణి, కె.సబిత, డి.రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



కేతేపల్లి : గుడివాడలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంక్షిప్త సమాచారం

ఎక్స్‌గ్రేషియా అందించాలి

నల్లగొండ టౌన్ : విధి నిర్వహణలో మృతి చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా అందించాలని ఆ సంఘం నాయకులు కోరారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో సీఆర్పీ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మగాని రాజు, ఎస్.భిక్షం, చరక వెంకటకృష్ణ, ఇటిక్యాల రమేష్, బొజ్జ శంకర్, లక్ష్మి, శోభ, అజీమ్ బాబా, జహంగీర్ భాష, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

కనగల్ : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని కిసాన్ సెల్ జిల్లా రైతు కన్వీనర్, పగిడిమర్రి మాజీ సర్పంచ్ గోలి జగాల్‌రెడ్డి అన్నారు. శనివారం బెంగళూరు పట్టణంలో జరిగిన ఇండియన్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇంటలెక్చువల్స్ కాన్సిట్యూషనల్ యాస్‌పెక్ట్స్ ఆన్ ఎన్విరాన్మెంటల్ సమావేశానికి జిల్లా తరపున ఆయన హాజరై మాట్లాడారు.

'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ

నకిరేకల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయపదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఇందురు సాగర్ కోరారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అంబటి చిరంజీవి, వెంకటేశ్వర్లు, రవి, సత్తయ్య పాల్గొన్నారు.

యువత క్రీడా స్ఫూర్తి కలిగిఉండాలి

తిప్పర్తి : యువత క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్ అన్నారు. శివరాత్రి సందర్భంగా మండలంలోని ఇండ్లూర్ గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్‌రావు, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కొమ్ము గిరి ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కట్టంగూర్ : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పాఠశాల ఎస్ఓ నీలాంబరి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

సమరశీల పోరాటాలు తప్పవు

నకిరేకల్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్‌మెంట్‌ను విడుదల చేసేంత వరకు సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో జరిగిన సంఘం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19, 20తేదీల్లో నల్లగొండలో నిర్వహించే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు తనుష్‌రెడ్డి, ముసుకు రవీందర్, జీవన్, ఆకాష్, అజయ్, రాఘవేంద్ర, గణేష్, రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.

మౌంట్‌ఫోర్ట్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని మౌంట్‌ఫోర్ట్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎన్జీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వైవీఆర్.ప్రసన్నకుమార్, పాఠశాల కరస్పాండెంట్ హృదయ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బాలఇన్నా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.